## దంచికొట్టిన వాన

- అర్ధగంట వ్యవధిలోనే 89.5 మిల్లీమీటర్ల వర్షపాతం



**టీ మీడియా, అక్టోబర్ 4,ఖమ్మం రూరల్ :**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం, వాయుగుండం ఎఫెక్ట్ శనివారం ఖమ్మం రూరల్ మండలంలో స్పష్టంగా కనపడింది. దీంతో సాయంత్రం 4 గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పు సంభవించింది. ఆ వెంటనే దట్టమైన మేఘాలు అలుముకోవడం, కాసేపటికి భారీ నుంచి అతి భారీ వర్షం కురవడంతో అనేక గ్రామాల్లోకి వరద నీరు వచ్చి చేరింది. ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండలంలో కురిసిన భారీ వర్షానికి జనజీవనం కాసేపు పూర్తిగా స్తంభించిపోయింది. ఉదయం నుంచి ఉక్కపోత, అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిన మండల వాసులకు సాయంత్రం వేళ కురిసిన భారీ వర్షంతో ఉపశమనం కలిగింది. అయితే భారీ వర్షం పట్ల పత్తి, మిరప తోటలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంటుందని రైతులు వాపోయారు. పలు గ్రామాల్లో నిలిచిన వరద నీరును తొలగించేందుకు గ్రామ పంచాయతీ సిబ్బంది అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టారు.


ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 35
సంచిక : 45
పేజీలు : 3

ఆదివారం 05 అక్టోబర్, 2025

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ


# జాతీయ స్థాయిలో సత్తా చాటిన పల్లవి

ఇది యువతకు ప్రేరణ కలిగించే ఘనత అని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. తాళ్లూరి పల్లవి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ విభాగంలో ఆల్ ఇండియా ట్రేడ్ టాపర్ గా నిలిచి ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కౌశల్ దీక్షాంత్ సమారోహ్ లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా శనివారం జాతీయ అవార్డును స్వీకరించింది. ఈ సందర్భంగా విషయం తెలుసుకున్న మంత్రి పొంగులేటి ఓ ప్రకటన విడుదల చేశారు. పల్లవితో పాటు ఆమె తల్లిదండ్రులు తాళ్లూరి రవి, అజితలను కూడా అభినందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

## ప్రత్యేకంగా అభినందించిన ఉప ముఖ్యమంత్రి

**టీ మీడియా,అక్టోబర్ 4,ఖమ్మం రూరల్ :**

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లో సత్తా చాటిన ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల గ్రామానికి చెందిన తాల్లూరి పల్లవిని చూసి ఖమ్మం జిల్లా మొత్తం గర్విస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. జిల్లాకు చెందిన బిడ్డ జాతీయ స్థాయిలో సత్తా చాటడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ప్రొగ్రామింగ్ అసిస్టెంట్ విభాగంలో జాతీయ స్థాయిలో టాపర్ గా నిలవడం మనందరికీ గర్వకారణం అని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కౌశల్ దీక్షాంత్ సమారోహ్ లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా పల్లవి శనివారం జాతీయ అవార్డును స్వీకరించడం సంతోకరమని అన్నారు. తాల్లూరి పల్లవిని ఆదర్శంగా చేసుకుని యువత ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, శాస్త్రసాంకేతిక రంగాల్లో తమ ప్రతిభను చాటాలని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తాల్లూరి పల్లవి తల్లిదండ్రులు తల్లూరి రవి, అజితలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేకంగా అభినందించారు.

**మంత్రి పొంగులేటి అభినందన**

పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల గ్రామానికి చెందిన పల్లవి జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడం గర్వకారణమని...



## నిబంధనల ప్రకారం ఎన్నికల విధులు

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

**టీ మీడియా,అక్టోబర్ 4, ఖమ్మం:**






నిబంధనల ప్రకారం ఎన్నికల విధులు కట్టుదిట్టంగా నిర్వహించే విధంగా సన్నద్ధం కావాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అన్నారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి శనివారం సాయంత్రం స్థానిక సంస్థల ఎన్నికల కోసం నామినేషన్ స్వీకరణ, పోస్టల్ బ్యాలెట్, టీమ్ ల ఏర్పాటు, తదితర అంశాలపై మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీలు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూస్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ స్వీకరణకు మండల కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో అవసరమైన మేర కౌంటర్ లు ఏర్పాటు చేసి సంబంధిత ఎంపిటిసి స్థానాలకు నామినేషన్లు స్వీకరించాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు ఎన్నికల నిర్వహణలో


మిగతా 3లో...




## మద్దతు ధర లభించేలా పటిష్ట కార్యాచరణ

### అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

**టీ మీడియా, అక్టోబర్ 4,ఖమ్మం:**

పత్తి, ధాన్యం పండించిన రైతులకు మద్దతు ధర లభించేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో వానాకాలం ధాన్యం కొనుగోలుసన్నద్దతపై, కపాస్ కిసాన్ యాప్ పై శనివారం సంబంధిత అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రాబోయే వానాకాలంలో జిల్లాకు సంబంధించి 2 లక్షల 60 వేల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం, 40 వేల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం మొత్తం 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం ఉందని అన్నారు. సన్న ధాన్యం కొనుగోలుతో పాటు 3 నుంచి 4 నెలల లోపు మిల్లింగ్ చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.తూర్పారా పట్టిన తర్వాత నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన యంత్రాలను అందుబాటులో పెట్టాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు క్రమ పద్ధతిలో వచ్చేలా చూడాలని అన్నారు.ప్రతి క్లస్టర్ పరిధిలో ఉన్న కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఏ.ఈ.ఓ. సర్టిపై చేయాలని అన్నారు. ధాన్యం కోతలు క్రమ పద్ధతిలో


మిగతా 3లో...






## ఏజెన్సీ ప్రజలకు అందుబాటులో పోలీస్ శాఖ

- ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్


3లో...

# ప్రజా సమస్య పరిష్కరించే వారికి పట్టంకట్టండి

- **స్థానిక ఎన్నికలకు సీపీఐ(ఎం) సన్నద్ధం**



**టీ మీడియా, అక్టోబర్ 04, సింగరేణి (కారేపల్లి) :**

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాడుతున్న వారికే స్థానిక ఎన్నికలలో పట్టం కట్టాలని సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. శనివారం కారేపల్లిలో సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశం ముండ్ల ఏకాంబరం అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో భూక్యా వీరభద్రం మాట్లాడుతూ అనునిత్యం ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలపై గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర సీపీఐ(ఎం)కు ఉందన్నారు. గ్రామాల్లో ఆదర్శవంతమైన పాలన సీపీఐ(ఎం) ప్రజాప్రతినిధులతోనే సాధ్యమన్నారు. నీతిగా నిజాయితీగా పనిచేసే వారిని ప్రజలు ఆదరించి గెలిపించుకోవాలనికోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు సకాలంలో జరపక పోవటంతో గ్రామాలలో అభివృద్ధి కుంటుబడిరదన్నారు. సింగరేణి మండలంలోని ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలతో పాటు 41 గ్రామపంచాయతీలు, 16 ఎంపీటీసీ స్థానాలకు అభ్యర్థులను నిలబెట్టుటకు సీపీఐ(ఎం) కార్యాచరణ సిద్ధం చేసిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర, డివిజన్ కమిటీ సభ్యులు వజ్జా రామారావు, ఉసిరికాయలపల్లి మాజీ సర్పంచ్ బానోత్ బన్సీలాల్, డివిజన్ కమిటీ సభ్యురాలు కే.ఉమావతి, మండల కమిటీ సభ్యు లు కేశగాని ఉపేందర్, వల్లభనేని మురళి, యనమనగండ్ల రవిబాబు, అజ్మీర శోభన్ బాబు, జి.వెంకన్న, తేజావత్ చందర్, దాసరి సైదులు, పండగ కొండయ్య, కల్తి రామచంద్రయ్య,కరపటి సీతారామయ్య, రాంజీ, అన్నారపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యేకు నివాళ్లు ఆర్పించిన కాంగ్రెస్ నాయకులు

**టీ మీడియా, అక్టోబర్ 04, సింగరేణి (కారేపల్లి) :**

తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మృతదేహాన్ని కారేపల్లి మండల కాంగ్రెస్ నాయకులు సందర్శించి నివాళ్లు ఆర్పించారు. కామేపల్లి మండలం పాతలింగాలకు చెందిన రాంరెడ్డి కుటుంబానికి కారేపల్లి మండలంలో బలమైన అనుచర వర్గం ఉంది. రాంరెడ్డి దామోదర్ రెడ్డి మృతి విషయం తెలుసుకున్న పాత కమలాపురం, చీమ్నాతండా, కొత్తకమలాపురంకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళ్లు ఆర్పించారు. ఈకార్యక్రమంలో రైతు బంధు మాజీ కన్వీనర్ గుగులోత్ శ్రీను, నాయకులు వడ్డే అనంతరామయ్య, తోటకూరి వెంకటేశ్వర్లు, తేజావత్ బాబురావు, కొత్త అచ్చుయ్య తదితరులు ఉన్నారు.

## జోరు తగ్గని కోటమైసమ్మ జాతర

- **మూడోవ రోజు అదే తాకిడి**
- **వర్షంతో ఇబ్బంది పడ్డ దుకాణదారులు**



**టీ మీడియా, అక్టోబర్ 04, సింగరేణి ( కారేపల్లి) :**

ఉసిరికాయలపల్లి కోటమైసమ్మ తల్లి జాతర మూడోవ రోజు శనివారం జోరుగా సాగుతుంది. జాతరకు జన తాకిడి విపరీతంగా పెరిగింది. రాత్రి సమయంలో జాతర చూడటానికి మండలంతో పాటు చుట్టుపక్కల మండలాల ప్రజలకు వేలాదిగా తరలి వస్తుండటంతో జాతర జనంతో కిక్కిరిసి పోతుంది. సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై బ్కెరు గోపీ ఆధ్వర్యంలో పోలీసులు రేయంబవళ్లు బందోబస్తు నిర్వహిస్తూ జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా చూస్తున్నారు. వాహనాలను కోటమైసమ్మ ఆర్చీ వద్దనే నిలిపివేసి ట్రాఫిక్‌ను నియంత్రణలో ఉంచారు. వినోధ సాధనాలపై ఎక్కి విహరించటానికి జనం ఎగబడ్డారు.

### వర్షంతో దుకాణదారుల ఇబ్బంది

వర్షంతో జాతరలో దుకాణాలు ఏర్పాటు చేసుకున్న దుకాణదారులు ఇబ్బందులు పడ్డారు. జాతరలో తాత్కాలికంగా పరదాలు కట్టి చిరువ్యాపారులు వస్తువులు అమ్మకాలు సాగిస్తున్నారు. వర్షంతో దుకాణంలో వస్తువులు తడిసి పోకుండా కాపాడటానికి అవస్థలు పడ్డారు.



## రేషన్ షాపును తనిఖీ చేసిన డీఎస్‌వో

**టీ మీడియా, అక్టోబర్ 04, సింగరేణి (కారేపల్లి) :**

కారేపల్లిలోని రేషన్ షాపులను శనివారం జిల్లా ఫౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్ తనిఖీ చేశారు. కారేపల్లి- 1,2 షాపులను తనిఖీ చేసిన డీఎస్‌వో స్టాక్ ను, రికార్డులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీఎస్‌వో రేషన్ డీలర్లకు సూచనలు చేశారు. లబ్ధిదారులకు సక్రమంగా బియ్యం పంపిణి చేయాలన్నారు. స్టాక్ బోర్డు, షాపు సమయాపాలన వేళలు ప్రదర్శించాలని ఆదేశించారు. నెలవారి నిల్వల రిపోర్టును తహసీల్ధార్ కార్యాలయంలో అందిచాలన్నారు. డీఎస్‌వో వెంట సివిల్ సప్లై ఆర్ఐ వీరయ్య రేషన్ డీలర్ మతీన్ తదితరులు ఉన్నారు.



## మోసం చేస్తున్నప్రభుత్వం: పీడీఎస్‌యూ

- **చదువులపై కళాశాల బంద్‌తో ప్రభావం**

**టీ మీడియా, అక్టోబర్4,సింగరేణి(కారేపల్లి) :**

రాష్ట్రంలోని విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసగిస్తుందని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినపల్లి మస్తాన్ విమర్శించారు. శనివారం కారేపల్లిలో జరిగిన పీడీఎస్‌యూ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీజు రీయింబర్స్మెంట్, ఉపకారవేతనాలు విడుదల చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం మాట తప్పిందన్నారు. దీంతో కళాశాల యాజమాన్యాలు మరోసారి ఈనెల 6వ తేది నుండి బంద్‌కు పిలుపునిచ్చాయన్నారు. విద్యపట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరికి పీజు రియాంబర్స్‌మెంట్, ఉపకారవేతనాలు, బకాయిలు నిదర్శనంగా కనిపిస్తుయన్నారు. విద్యా సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు మండల అధ్యక్షుడు సంజయ్, నాయకులు కిషోర్, కోటేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ సబ్స్టేషన్ నందు నూతన బ్రేకర్

- **ఇనుగుర్తి శ్రీనివాసచారి, ఎస్ఈ ఖమ్మం సర్కిల్**

**టీ మీడియా,అక్టోబర్ 4, మధిర:**

సిరిపురం సబ్ స్టేషన్ లిఫ్ట్ ఫీడర్ నుండి సిరిపురం లిఫ్ట్ కు మరియు కలకోట బ్రాహ్మణపల్లి రాపల్లి గ్రామాలకు సరఫరా అవుతున్న విద్యుత్తును, ప్రత్యామ్నాయంగా కలకోట, సిరిపురం లిఫ్ట్ ఫీడర్లు గా విడదీస్తూ సుమారు 8 లక్షల రూపాయల వ్యయంతో నూతన బ్రేకర్ ను ఈరోజు ఖమ్మం సర్కిల్ %ాజు% ఇనుగుర్తి శ్రీనివాసాచారి గారు ప్రారంభించారు. దీనితో ప్రస్తుతం ఒకే బ్రేకర్ మీద సిరిపురం లిఫ్ట్ కు మరియు కలకోట బ్రాహ్మణపల్లి రాపల్లి గ్రామాలకు సరఫరాతున్న విద్యుత్తును ప్రత్యామ్నాయ నూతన బ్రేకర్ ఏర్పాటుతో ఈ రెండిటిని విడదీసి అంతరాయం లేని విద్యుత్ సరఫరాను అందించుటకు అవకాశం ఏర్పడినది. సిరిపురం సబ్ స్టేషన్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైరా డివిజన్ డిఈ బండి శ్రీనివాసరావు గారు, మధిర సబ్ డివిజన్ ఏడిఈ ఎం. అనురాధ గారు, మధిర రూరల్ సెక్షన్ ఏఈ ఎస్. మైథిలి గారు మరియు ఇతర విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## విష్ణు సహస్రను అభినందించినలు

**టీ మీడియా,అక్టోబర్ 4, మధిర:**

ఖమ్మం జిల్లా మధిర మున్సిపాలిటీ పరిధిలోని మధిర పట్టణానికి చెందిన ఆకుల ఆనంద్, పూర్ణిమ దంపతుల కుమార్తె విష్ణు సహస్ర ఎంబిబిఎస్ ఫ్రీ సీట్ సాధించిన సందర్భంగా శనివారం బంధుమిత్రులు శాలువా , మెమెంటో తో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు భూసా కోటేశ్వరరావు మాట్లాడుతూ భాస్కర మెడికల్ కాలేజ్ హైదరాబాదులో ఫ్రీ సీటు సాధించిన విష్ణు సహస్ర పట్టుదల ,కృషి అభినందనీయమని అన్నారు. వైద్య వృత్తిలో అత్యున్నత స్థానాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థిని తల్లిదండ్రులు ఆనంద్, పూర్ణిమ , తాతయ్య ,అమ్మమ్మ ఆది పెద్దబ్బాయి కస్తూరి ,నాయనమ్మ వాణి, బాబాయ్ ఆకుల అశోక్ లను అభినందించారు. ఈ కార్యక్రమంలో కొలగాని ప్రసాద్ రావు - అరుణశ్రీ, శాఖమూడి రంగారావు ,ధనిశెట్టి శ్రీనివాసరావు ,గుర్రం సురేష్ ,శంకర శెట్టి సాయి తదితరులు పాల్గొని అభినందించారు.



## వధువరులను ఆశీర్వదించిన నాయకులు

**టీ మీడియా, అక్టోబర్ 4, సింగరేణి (కారేపల్లి) :**

ఇల్లందు మండల కార్యాలయంలో పని చేస్తున్న బందల బాలరాజు- సుదీక్ష వివాహం కారేపల్లిలో శనివారం జరిగింది. ఈవివాహానికి సీపీఐ(ఎం) నేతలు హాజరై నూతనవధువరులను ఆశీర్వదించారు. కారేపల్లికి చెందిన బాలరాజు గతంలో వీఆర్ఏ గా పని చేసి వీఆర్ఏ ఆసోసియేషన్ జిల్లా సహాయకార్యదర్శిగా పని చేశారు. బాలరాజు వివాహానికి సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర, నాయకులు వజ్జా రామారావు, కొండబోయిన ఉమావతి, అమరనేని కృష్ణ, తలారి దేవప్రకాశ్, గుర్రం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ జిల్లా నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, మల్లెల నాగేశ్వరరావు, గుగులోత్ సంతోష్, తొగరు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారం ఎన్నికల విధులు

(మొదటిపేజీ తరువాయి...)

సంపూర్ణ మద్దతు ఎంపీడీఓలకు అందించాలని, ప్రతి మండలంలో ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన మేర అధికారులు నియామకం పూర్తి చేయాలని అన్నారు.ఎన్నికల విధుల పట్ల అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండేలా పటిష్ట శిక్షణ అందించాలని అన్నారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ తర్వాత పోటీ అభ్యర్థుల ప్రకటన, వారికి గుర్తుల కేటాయింపు తదితర అంశాలపై పూర్తి శిక్షణ అందించాలని అన్నారు.పోలింగ్ అధికారులకు శిక్షణ అందించాల్సి ఉంటుందని, మండలాల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన సంపూర్ణ సామాగ్రి అందించడం జరుగుతుందని అన్నారు. అక్టోబర్ 6 న మొదటి దశ ర్యాండమైజేషన్ తర్వాత డ్యూటి అలాట్ చేయనున్నట్లు అన్నారు.ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు అందరికీ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సర్వీస్ ఓటర్లకు, పీడి యాక్ట్ క్రింద అరెస్టైన వారికి, ఎన్నికల విధులు నిర్వహించే వారికి పోస్టల్ బ్యాలెట్ జారీ చేయడం జరుగుతుందని, ఓటర్ జాబితా పరిధిలో పోస్టల్ బ్యాలెట్ జారీ చేయాల్సిన వారి పేర్లు రౌండప్ చేసుకోవాలని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల వివరాలు, ఓటర్ జాబితా వివరాలు సంబంధిత పోటీ చేసే అభ్యర్థులకు సమాచారం అందించాలని అన్నారు. నామినేషన్ కేంద్రాల 100 మీటర్ల పరిధిలో ఎటువంటి ర్యాలీ, ప్రచారాలు అనుమతి లేవని, అభ్యర్థితో పాటు ముగ్గురికి మాత్రమే అనుమతించడం జరుగుతుందని అన్నారు.ఎన్నికల ప్రచార నిమిత్తం ర్యాలీ, సమావేశాల నిర్వహణకు ముందస్తు అనుమతి తీసుకోవాలని, సౌండ్ సెట్, వాహనానికి ప్రత్యేకంగా అనుమతి తీసుకోవాలని, ఎక్కడ కూడా పోటీదారులకు ఒకే రూట్ లో సమావేశాలు, ర్యాలీలో నిర్వహణకు అనుమతి జారీ చేయవద్దని అన్నారు.ఎన్నికల్లో ప్రలోభాలకు గురి చేసేందుకు అక్రమంగా నగదు, మద్యం తరలిస్తే పట్టుకుని సీజ్ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో దీక్షా రైనా, డిఆర్డిఓ సన్యాసయ్య, డిపిఓ ఆశాలత, అదనపు డిఆర్డిఓ జయశ్రీ, హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

## మద్దతు ధర లభించేలా పటిష్ట కార్యాచరణ

(మొదటిపేజీ తరువాయి...)

జరిగేలా చూడాలని, హార్వెస్టర్ల పనితీరు సరిగా ఉండేలా ఏ.ఈ.ఓ. లు పర్యవేక్షించాలని అన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రం పరిధిలో అవసరమైన గన్ని బ్యాగులు వారికి కేటాయించిన మిల్లుల నుంచి తెచ్చుకోవాల్సి ఉంటుందని అన్నారు. రైతులకు గన్ని బ్యాగులను ముందే ఇచ్చే పద్ధతి మారాలని అన్నారు. జిల్లాలో అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉన్నాయని, ప్రతి సెంటర్ వద్ద గన్ని బ్యాగులు, టార్పాలిన్ కవర్లు, తేమ యంత్రాలు అందుబాటులో పెట్టాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మిల్లర్లను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. పత్తి కొనుగోలు సులభతరం చేసే కపాస్ కిసాన్ యాప్ పై రైతులకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఈ సందర్భంగా మార్కెటింగ్ ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి మాట్లాడుతూలి బహిరంగ మార్కెట్ లో పత్తి ధర పడిపోతున్న నేపథ్యంలో కనీస మద్దతు ధర చెల్లించి సిసిఐ ద్వారా కొనుగోలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని అన్నారు. నాణ్యమైన పత్తి పంట (8 శాతం తేమ) క్వింటాల్ 8110 రూపాయల మద్దతు ధర చెల్లిస్తుందని అన్నారు. తేమ శాతం తగ్గుతూ ఉంటే మద్దతు ధర తగ్గుతుందని దీనిపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని అన్నారు. పత్తి రైతులు మార్కెట్ కు వచ్చి ఇబ్బందులు పడకుండా ఇంటి వద్ద నుంచి స్లాట్ బుక్ చేసుకునే విధంగా కపాస్ కిసాన్ యాప్ లో సౌకర్యం కల్పించామని అన్నారు. పత్తి కొనుగోలు సంబంధిత సేవలకు రైతులు టోల్ ఫ్రీ నెంబర్ 18005995779, వాట్సాప్ సేవలకు 8897281111 నందు సంప్రదించాలని తెలిపారు.అనంతరం మండలాల వారీగా కొనుగోలు కేంద్రాలలో ఉన్న సమస్యల గురించి తెలుసుకొని వాటి పరిష్కారానికి ఆదనపు కలెక్టర్ పలు సూచనలు చేశారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పత్తి కొనుగోలు, కపాస్ కిసాన్ యాప్ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీమ్, జిల్లా పౌర సరఫరాల సంస్థ డి.ఎం. శ్రీలత, సంబంధిత అధికారులు, ఏడిఏలు, ఏఓలు, ఏఈఓలు,తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ వర్కర్ల పై మొండి వైఖరీ వీడాలి

**టీ మీడియా, అక్టోబర్ 4,ఇల్లెందు :**



ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ డైలివేజ్ ఔట్ సోర్సింగ్ వర్కర్లు గత 23 రోజులుగా నిర్వహిస్తున్న సమ్మెపై ప్రభుత్వం మొండి వైఖరి అవలంభిస్తుందని జేఏసీ నాయకులు అబ్దుల్ నబీఅన్నారు. ఇల్లెందు పట్టణ, మండల పరిధిలో ఉన్న బాలికల, బాలుర ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లలలో పనిచేస్తున్న డైలివేజ్ ఔట్ సోర్సింగ్ వర్కర్లు శనివారం సమ్మెను తిరిగి ప్రారంభించారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి, జేఏసీ నాయకులు లక్ష్మణ్, లక్ష్మీనారాయణ రామకళా ,మంగలు రొంపెడు బాలికల ఆశ్రమ పాఠశాల వద్ద సమ్మె శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ డైలీ వేజ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని, కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తూ ఊడిగం చేయిస్తుందని వాపోయారు. పెండింగ్ వేతనాలు ఇవ్వకుండా, కొత్త మెనూ ప్రకారం మరింత పని భారం పెంచిందని ఆరోపించారు. టైమ్ స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో స్వామి, తారబాయ్,నాగేశ్వరరావు, వజ్జ నగేష్, కుమార్, హాస్టల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రజలకు అందుబాటులో పోలీస్ శాఖ

- ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్




**టి మీడియా, అక్టోబర్ 4,చర్ల :**

మండలంలోని ఛత్తీస్గఢ్ రాష్ట్ర సరిహద్దు గ్రామాలైన బట్టిగూడెం,బత్తినపల్లి, రామచంద్రాపురం గ్రామాలను భద్రాచలం ఏఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్ సందర్శించారు. కమాండర్ సెబాస్టియన్,చర్ల సీఐ రాజు వర్మ ఇతర పోలీస్ అధికారులు,సిబ్బందితో కలిసి ఈ మూడు మావోయిస్ట్ ప్రభావిత గ్రామాల్లోని 120 కుటుంబాలను సందర్శించారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న ఈ మూడు గ్రామాల ప్రజలకు నేస్టిల్ కంపెనీ సహకారంతో నిత్యావసర వస్తువులను అందించారు.ఈ సందర్భంగా ఏఎస్పీ గారు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సారథ్యంలో ఏజెన్సీ ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని,మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసీలకు విద్య,వైద్యం,రవాణా వంటి కనీస సౌకర్యాలను కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు.ఇందులో భాగంగానే జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటివరకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో నివసించే అదీవాసీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వర్షాల అనంతరం పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.డెంగీ,మలేరియా వంటి విషజ్వరాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.అభివృద్ధి నిరోధకులైన నిషేదిత మావోయిస్టులకు ఎవ్వరూ సహకరించవద్దని కోరారు. ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానైనా మావోయిస్టులకు సహకరిస్తే, అట్టి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొనబడతాయని అన్నారు.మారుమూల ఏజెన్సీ ప్రజలకు నిత్యావసర వస్తువులను అందించడానికి ముందుకొచ్చిన Nestle



కంపెనీ వారికి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.



## రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలి

- పెసా చట్టం ప్రకారం కేటాయించాలి
- బోడ రమేష్ నాయక్

**టీ మీడియా , అక్టోబర్ 4 ,మహబూబాబాద్ :**

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ నివాసం గూడూరు మండలం మచ్చర్ల లో కలిసి స్థానిక సంస్థల ఎన్నికలలో ఎస్టీలకు జరుగుతున్న అన్యాయంపై హుస్సేన్ నాయక్ ని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం బోడ రమేష్ నాయక్ మాట్లాడుతూ తండాల గ్రామపంచాయతీలలో దాదాపుగా 100 శాతం ఎస్ టి లంబాడి ప్రజలు ఓట్లను కలిగి ఉండి కేవలం ఒకటి రెండు ఓట్లు ఇతర కులాలకు సంబంధించిన ఓట్లు ఉంటే ఎస్టీలకు కాకుండా ఇతర కులాలకు వారికి సర్పంచ్ గా రిజర్వేషన్ కేటాయించడం జరిగింది. తండాల గ్రామపంచాయతీలలో ఎస్టీలకు అధికారం ఇచ్చినట్టే ఇచ్చి మళ్లీ గుంజుకుంటున్నారని అన్నారు. అదేవిధంగా జడ్పిటిసి స్థానాలలో ఎస్టీలకు పూర్తిస్థాయి అన్యాయం జరిగిందన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో చూస్తే పెసా చట్టాలకు వ్యతిరేకంగా ఏజెన్సీ చట్టాలకు తూట్లు పొడుస్తూ గిరిజనులకు తీవ్ర అన్యాయానికి గురి చేస్తున్నారు అని అగ్రకులాలకు చెందినవారు ఎస్టీలు రాజకీయంగా ఎదగకుండా అడగదొక్కుతున్నారని అన్నారు. ఎస్టి స్థానాలలో ఇతర కులాలకు రిజర్వేషన్లను కేటాయిస్తున్నారని అన్నారు. మహబూబాబాద్ అతిపెద్ద గిరిజన జిల్లా అయినా కూడా మహబూబాబాద్ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ గా జనరల్ స్థానాన్ని కేటాయించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎస్టీలపై అగ్రకులాల ఆధిపత్యం ఏ విధంగా ఉందో ప్రజలు గమనించాలని కోరారు. ఈ రిజర్వేషన్లపై పునరాలోచన చేసే విధంగా స్థానిక సంస్థల్లో ఎస్టీలకు పూర్తిస్థాయి న్యాయం జరిగే విధంగా రిజర్వేషన్ స్థానాలు కేటాయించాలని వెంటనే రాష్ట్ర ఎన్నికల కమిషన్ మరియు చీఫ్ సెక్రటరీలకు అత్యవసర నోటీసులు జారీ చేయాలని కోరారు.

## గంతలమయంగా ఎన్‌హెచ్ 930పీ

- వాహదారుల ఇబ్బందులు



**టీ మీడియా, అక్టోబర్ 4,టేకులపల్లి :**

భద్రాద్రి కోత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల ప్రజలకు ఇటు కొత్తగూడెం వెళ్లాలన్నా, అటు ఇల్లెందు వెళ్లాలన్నా రహదారి ఇబ్బందికరంగా మారి ప్రయాణం నరక ప్రాయమైంది. ఓ వైపు లారీల దుమ్ము, మరోవైపు గుంతలతో ప్రయాణం ప్రమాదకరంగా ఉందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగూడెం నుండి ఇల్లెందు ప్రధాన రహదారిలో నిత్యం వేలాది వాహనాలు తిరగడంతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. నేషనల్ హైవే పూర్తయ్యేదెన్నడోనని, రోడ్డు ఇంకా అధ్వానంగా తయారైందని ఆవేదన వ్యకం చేస్తున్నారు.ఇటివలే మూడు రోజులు లోడుతో ఉన్న లారీలు గుంతలతో బోల్తా పడ్డాయని, టూ వీలర్స్‌తో ప్రయాణం చేయాలంటే ఇబ్బంది పడుతున్నట్లు మండల ప్రజలు అవేదన చెందుతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రయాణం చేసే రోడ్డుపై పట్టింపులేదనే విమర్శలు వినవస్తున్నాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకుని కనీసం గుంతలనైనా పూడ్చాలని, మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



## సింగరేణి రీజినల్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

**టీ మీడియా, అక్టోబర్ 4,ఇల్లెందు :**

ఇల్లెందు సింగరేణి ఏరియాలో రీజినల్ స్థాయి క్రీడా పోటీలను ఏరియా జీఎం కృష్ణయ్య శనివారం ప్రారంభించారు. ఇల్లెందు సింగరేణి గ్రౌండ్ లో వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ 2025 –26 కు గాను ఇల్లెందు ఏరియా ఆధ్వర్యంలో రీజనల్ స్థాయి మణుగూరు, ఇల్లెందు ఏరియా క్రీడా పోటీలను జీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఒత్తిడి తట్టుకునే విధానం పెంపొందించుకోవచ్చన్నారు. ఉద్యోగులు తమ నిత్య జీవిత విధుల్లో భాగంగా ప్రతిరోజు 30 నిమిషాల పాటు తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు.